క్లుప్తంగా

కూచిపూడిలో 'బీట్ ది హీట్'



కూచిపూడి(మొవ్వ): మూడో శనివారం సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో 'బీట్ ది హీట్' కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు 'బీట్ ది హీట్' పేరిట పంచాయతీల్లో మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఇందులో భాగంగా కూచిపూడి పంచాయతీలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ కొండవీటి వెంకటరమణ విజయలక్ష్మి అమరబాలేశ్వరరావు దంపతులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు. కాగా మొవ్వ మండలంలో నిర్వహించిన ఈ కార్యక్రమాలను ఎంపీడీఓ జె.విమాదేవి, డెప్యూటీ ఎంపీడీఓ ఎంఎస్ కే పరమాత్మ పర్యవేక్షించారు.

25న వెంకటేశ్వరస్వామి మాస కల్యాణం

గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత వెంకటేశ్వర స్వామి సన్నిధిలో ఈ నెల 25వ తేదీన స్వామివార్లకు వేద పండితులు మాస కల్యాణాన్ని నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని శనివారం దేవస్థాన ధర్మకర్తలు పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి, బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు తెలిపారు. ఈ కల్యాణాన్ని మెయిల్ అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

వెంకన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పెదసనగల్లు(మొవ్వ): మొవ్వ మండలం పెదసనగల్లులోని శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శ్రీ వైఖానస ఆగమ ప్రవర దీవి ఉదయ్ కుమార అయ్యంగార్ బ్రహ్మత్వంలో దేవస్థాన అర్చకులు అగ్నిహోత్రం శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో విశ్వక్సేన పూజ, దీక్షాధారణ యాగశాల ప్రవేశం అంకురార్పణ అగ్నిప్రతిష్ట ధ్వజారోహణం నిర్వహించారు. ఈ కార్యక్రమాలను దేవాలయ ధర్మకర్తల మండలి దేవస్థాన అభివృద్ధి సంఘ కేంద్ర కార్యవర్గం పర్యవేక్షించాయి.

ఉచిత నేత్ర వైద్యశిబిరం

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవా భవన్‌లో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. వల్లభనేని కమలమ్మ పేరిట మనవడు కొల్లి రాజేష్ ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. గుడివాడ లయన్స్ కంటి ఆస్పత్రి వారు ఈ పరీక్షలను చేశారు. ఈ పరీక్షల అనంతరం కంటి శస్త్ర చికిత్సలకు సిఫార్సు చేసినట్లు లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు చిట్టిబాబు, పెరుమాళ్లు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



గుడివాడరూరల్: స్థానిక టీడీపీ కార్యాలయంలోని ప్రజావేదికలో నియోజకవర్గ పరిధిలోని పలువురు బాధిత కుటుంబాలకు రూ.30 లక్షల సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడిచిన 11 నెలల్లో నియోజకవర్గ పరిధిలో బాధిత కుటుంబాలకు కోటిన్నర సీఎం సహాయ నిధి చెక్కులు అందించామన్నారు. కార్యక్రమంలో పట్టణ, నందివాడ మండలాల టీడీపీ అధ్యక్షులు దింట్యాల రాంబాబు, దానేటి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనారాయణుడి కల్యాణం

ముదినేపల్లి రూరల్: మండలంలోని చేవూరు లక్ష్మీ నారాయణుడి స్వామి ఆలయ వార్షిక కల్యాణోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం రాత్రి స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

అన్నె నవీన్‌కు నివాళులు

గుడివాడ టౌన్: లయన్స్‌క్లబ్ ఆఫ్ గుడివాడ ప్రగతి కార్యదర్శి అన్నె నవీన్ మృతి క్లబ్‌కు తీరని లోటని లయన్స్‌క్లబ్ రీజినల్ సెక్రటరి ఉపద్రష్ట రాంబాబు అన్నారు. స్థానిక ఎన్జీఓస్ హోమ్‌లో శనివారం నవీన్ సంతాప సభ జరిగింది. పలువురు లయన్స్‌క్లబ్ సభ్యులు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. లయన్స్‌క్లబ్ ప్రగతి అధ్యక్షుడు ఎన్. శేషగిరిరావు, సభ్యులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పోలరాజ్ డ్రెయిన్ వంతెన

నిత్యం రద్దీతో ప్రయాణికులకు భయం.. భయం



ప్రమాదకరంగా మారిన పోలరాజ్ డ్రెయిన్ వంతెన

మండవల్లి: మండలంలోని లింగాల గ్రామంలోని పోలరాజ్ డ్రెయిన్ వంతెన శిథిలావస్థకు చేరింది. ఈ వంతెనపై పగలు, రాత్రి విపరీతమైన రద్దీ ఉంటుంది. సమీప గ్రామాలైన చిన కామనపూడి, పెద కామనపూడి, చిగురుకోట తదితర గ్రామాలకు చెందిన విద్యార్థులు ఈ వంతెనపై నుంచి ముదినేపల్లి, గుడివాడ, మచిలీపట్నం, కైకలూరు వంటి పట్టణాలకు ఇంజినీరింగ్, డిగ్రీ తదితర చదువుల కోసం ద్విచక్ర వాహనాలపై వెళుతుంటారు. అదేవిధంగా ధాన్యం బస్తాలతో లోడ్ లారీలు, ట్రాక్టర్లు వంతెనపై అహర్నిశలు తిరుగుతుంటాయి. ఇది నిర్మించి 50 సంవత్సరాలు పైబడటంతో వంతెన దిగువ భాగాన ఖానాలు కూడా దెబ్బతిన్నాయి. 1970వ సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు హయాంలో కృష్ణా జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ పిన్నమనేని కోటేశ్వరరావు సహకారంతో లింగాల గ్రామ సర్పంచ్ కమదన జగన్నాథరావు వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం వంతెన పైభాగంలోని పరిసరాల్లో పిచ్చి మొక్కలు మొలిచి వంతెన ఇబ్బందికరంగా మారింది. పాడైపోయిన వంతెన స్థానంలో నూతనంగా వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

నూతన వంతెన నిర్మించాలి

ప్రస్తుతం పోలరాజ్ డ్రెయిన్ వంతెన పూర్తిగా పాడైపోయింది. వంతెనపై రాకపోకలు సాగించడానికి వాహనదారులకు ఇబ్బందికరంగా ఉంటోంది. వంతెన అడుగున ఖానాలు కూడా దెబ్బతిన్నాయి. దీని స్థానంలో నూతన వంతెన నిర్మించి ప్రజల సమస్యను పరిష్కరించాలి.

–కమదన నాయనబాబు, ఎంపీటీసీ సభ్యుడు, లింగాల

వంతెన చుట్టూ పిచ్చి మొక్కలు



వంతెన పూర్తిగా పాడైపోయింది. వంతెన పైభాగంలో వంతెన చుట్టూ పిచ్చి మొక్కలు మొలిచి, వంతెనకు అంతరాయం కలిగిస్తున్నాయి. ఇప్పటికైనా ఈ వంతెన స్థానంలో నూతన వంతెన నిర్మించాలి. కనీసం మరమ్మతులైనా చేయాలి.

–ఎల్ఎస్ భాస్కరరావు, ఐక్య వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు

ఘనంగా తిరంగా ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న పట్టణ పౌరులు

గుడివాడ టౌన్: భారత్–పాక్‌ల మధ్య జరిగిన సిందూర్ యుద్ధంలో పాకిస్థాన్‌కు గట్టి గుణపాఠం నేర్పిన భారత్ విజయాన్ని పురస్కరించుకుని శనివారం పట్టణంలో తిరంగా ర్యాలీ ఘనంగా నిర్వహించారు. 300 అడుగుల జాతీయ జెండాతో వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, పట్టణ ప్రజలు, స్వచ్ఛంద సేవాసంస్థల ప్రతినిధులు పాల్గొని ర్యాలీ నిర్వహించారు. గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ర్యాలీని ప్రారంభించారు. స్థానిక కొత్త మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి ప్రారంభించి మార్కెట్ సెంటర్, వాసవీచౌక్, ఏజీకే సెంటర్, నెహ్రూచౌక్ మీదుగా తిరిగి మున్సిపల్ కార్యాలయం చేరుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉగ్రవాదుల దురాగతాలను అణచివేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్. మనోహర్, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ పిన్నమనేని బాబ్జి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు పాల్గొన్నారు.

చేపల చెరువు ఆదాయ పంపిణీ వివక్షపై ఫిర్యాదు



ఏలూరులో అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తున్న చటాకాయి గ్రామస్తులు

కైకలూరు: గ్రామస్తులందరికీ చేపల చెరువుల ద్వారా వచ్చే ఆదాయాన్ని సమానంగా పంపిణీ చేయడం లేదంటూ ఏలూరులో అటవీశాఖ అధికారులకు చటాకాయి గ్రామస్తులు శనివారం ఫిర్యాదు చేశారు. అనంతరం కైకలూరులో గ్రామస్తులు మాట్లాడుతూ చటాకాయిలో తొమ్మిది ఉమ్మడి చెరువులు ఉన్నాయన్నారు. వీటి ద్వారా వచ్చే ఆదాయాన్ని సమానంగా పంచాలన్నారు. ఆదాయం వచ్చే చెరువులు తీసివేసి అప్రధానమైన చెరువుల ఆదాయాన్ని తమకు గ్రామ పెద్దలు అందిస్తున్నారన్నారు. దీని వల్ల మిగిలిన వారికి ఒక్కొక్కరికీ ఏడాదికి రూ.12,000 ఆదాయం వస్తుంటే గ్రామంలో 300 మందికి మాత్రం ఒక్కొక్కరికి రూ.1,000 మాత్రమే వస్తుందన్నారు. ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లడం, జలగం వెంగళరావు సొసైటీ చెరువుల్లో సభ్యులుగా లేరంటూ, ఇతర గ్రామాల నుంచి వచ్చి స్థిరపడిన వారంటూ, గ్రామ పెద్దల మాటలను వ్యతిరేకిస్తున్నారనే కారణాలు చూపి ఆదాయం పంపిణీలో వివక్ష చూపుతున్నారని వివరించామన్నారు. ప్రస్తుతం కొన్ని చెరువుల్లో చేపల పట్టుబడులకు సిద్ధమవుతున్నారని, ముందుగా తమ సమస్య పరిష్కరించి పట్టుబడులు చేయాలని కోరామన్నారు. లేనిపక్షంలో ప్రస్తుత చెరువుల్లో ఒక చెరువును 300 మందికి కేటాయించాలని, లేదా కొత్త చెరువు తవ్వకానికి జిల్లా అటవీ అధికారులు అనుమతులు అందించాలని కోరామన్నారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు



జమీగొల్వేపల్లిలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



మండవల్లిలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు



గుడ్లవల్లేరులో ఆటలు ఆడుతున్న విద్యార్థులు

జమీగొల్వేపల్లి(పామర్రు): స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్రను పురస్కరించుకుని మండలంలోని జమీగొల్వేపల్లి శాఖా గ్రంథాలయంలో శనివారం పర్యావరణ పరిరక్షణ అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి ఉషాదేవి మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న పర్యావరణ పరిసరాలను కలుషితం కాకుండా కాపాడుకున్నప్పుడే మానవాళికి ఆరోగ్యకర–ఆనందకర జీవనం సాధ్యమవుతుందన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి, వాటి పరిరక్షణను ఒక బాధ్యతగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వి.నాగసురేష్ పాల్గొన్నారు.

పామర్రులో..

స్థానిక ద్వితీయ శ్రేణి గ్రంథాలయంలో వేసవి శిక్షణలో భాగంగా విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పించామని గ్రంథాలయ అధికారి ఎం. ఝాన్సీ రాణి పేర్కొన్నారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

మండవల్లి: విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలని లైబ్రేరియన్ ఎస్‌కే పర్వీన అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులతో పుస్తక పఠనం కార్యక్రమం నిర్వహించారు. పుస్తక పఠనం వలన కలిగే లాభాలను విద్యార్థులకు వివరించారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: వేసవి విజ్ఞాన శిబిరాలతో విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుతుందని అంగలూరు, గుడ్లవల్లేరు గ్రంథాలయాధికారులు పి.వి.వి.పద్మజ, వాణి అన్నారు. శనివారం వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు చెస్, క్యారమ్స్, కుర్చీలాట, ఖోఖో తదితర పోటీలను నిర్వహించారు.

వెంకన్న భక్తులకు అన్నసమారాధన



గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు భారీ అన్నసమారాధనను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతుల చేతుల మీదుగా ప్రారంభించారు. మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకటకృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆర్థిక సాయంతో జరిగిందని నిర్వాహకులు తెలిపారు.

పైపులైన్ వాల్వ్ ఏర్పాటు



మండవల్లి: మండవల్లి స్టేషన్‌రోడ్‌లోని తాగునీటి చెరువు నుంచి నీరు అందించేందుకు ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ మండల నిధులు మంజూరు చేసి పైప్‌లైన్, వాల్వ్ ఏర్పాటు చేశారు. ఈ పనులను శనివారం ఎంపీపీ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, ఏఈ, సర్పంచ్ మెండా ఝాన్సీ, సురేష్‌బాబు, వార్డు సభ్యులు పర్యవేక్షించారు. నీటి సరఫరా సక్రమంగా వస్తుండడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

కిసాన్ డ్రోన్స్‌పై అవగాహన

మండవల్లి: అధునిక పరిజ్ఞానంతో రూపొందించిన కిసాన్ డ్రోన్స్‌ను 80 శాతం సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తోందని వ్యవసాయ సహాయ సంచాలకులు జి.వెంకటమణ పేర్కొన్నారు. డ్రోన్స్ పూర్తి ఖరీదు రూ.9.8 లక్షలు కాగా బ్యాంకుల ద్వారా లోన్ గ్రూపుగా రైతులు ఏర్పడితే, బ్యాంకు లోన్, సబ్సిడీ, రైతు వాటా కలుపుకుని రైతులకు అందజేస్తారన్నారు. ఏఓ ఎస్‌కే జరీనా, వీఏఏలు చాప్లిన్, గోపాల్, డ్రోన్స్ కంపెనీ ప్రతినిధి రైతులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ముదినేపల్లి రూరల్: విద్యా సంస్కరణల్లో భాగంగా ప్రభుత్వం చేపడుతున్న చర్యల వల్ల ఉపాధ్యాయులు ఎదుర్కొనబోయే సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా నాయకుడు బేతాళ రాజేంద్ర ప్రసాద్ కోరారు. ముదినేపల్లిలో శనివారం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాలు సంస్కరణపై వ్యక్తం చేసిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా అందరి ఆమోదంతో సంస్కరణలు చేపడుతున్నట్లు ప్రకటించడం తగదన్నారు. ఫౌండేషన్ ప్రాథమిక పాఠశాలల్లో 1:20 నిష్పత్తి విధిగా అమలు చేయాలని కోరారు.

కొనసాగుతున్న క్రికెట్ టోర్నమెంట్

కైకలూరు: ఆచవరంలో నియోజకవర్గ మెగా టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోడానికి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి బూరుబోయిన శ్రీనివాసరావు నీలపాల నరేష్‌యాదవ్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. శనివారం కలిదిండి మండలం గుర్వాయిపాలెం, మండవల్లి జట్లు మధ్య ఎనిమిది ఓవర్లకు పోటీ జరిగింది. ఉత్కంఠ పోరులో గుర్వాయిపాలెం విజయం సాధించింది. విజేతకు రోజు వారి బహుమతిని అందించారు.

ఆలయాల అభివృద్ధికి రూ.లక్ష విరాళం



గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరులో రెండో అన్నవరంగా ప్రసిద్ధి గాంచిన శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయం, స్థానిక శ్రీ గంగానమ్మ ఆలయాల అభివృద్ధి పనులకు రూ.లక్షను ఒక అజ్ఞాత భక్తురాలు అందించటంతో గ్రామంలోని భక్తుల్లో ఇది చర్చనీయాంశమైంది. శనివారం ఈ విరాళాన్ని గుడ్లవల్లేరు ఎస్ఈఆర్ఎం విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావు చేతుల మీదుగా ఆలయ వేద పండితుడు రొంపిచర్ల శ్రీనివాసాచార్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు కొప్పురావూరి రవి, మురాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోండి



కుట్టు శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకటేశ్వరరావు

పమిడిముక్కల: వేసవిలో వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ దేవరపల్లి వెంకటేశ్వరరావు తెలిపారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక పంచాయతీ కార్యాలయంలో శనివారం జరిగిన 'బీట్ ది హీట్' కార్యక్రమంలో మాట్లాడారు. పంచాయతీ పరిధిలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికెళ్లి వర్మీకంపోస్టు తయారీని పరిశీలించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అదేవిధంగా ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని సందర్శించి, మహిళలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.సునీత, కార్యదర్శి లక్ష్మి పాల్గొన్నారు.

లక్షణాలను ముందే గుర్తించాలి



కైకలూరులో వడదెబ్బపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కైకలూరు: వేసవిలో వడదెబ్బ లక్షణాలను ముందుగానే గుర్తించి చికిత్స అందించాలని స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ అల్లాడ శ్రీనివాసరావు అన్నారు. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్రలో భాగంగా 'హీట్ ద బీట్' ఎండల నుంచి మనల్ని మనం ఎలా కాపాడుకోవాలి అనే అంశంపై కైకలూరు సీహెచ్‌సీలో రోగులకు శనివారం అవగాహన కల్పించారు. స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గోనెపాడు గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు ఎండ తీవ్రతలో తీసుకోవాల్సిన జాగ్రతలను వివరించారు. అనంతరం కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, బలానికి మందు బిల్లలను పంపిణీ చేశారు.

హనుమజ్జయంతికి ఆలయాలు ముస్తాబు



హనుమజ్జయంతికి సిద్ధమవుతున్న ఉండ్రపూడి–పోలవరం వద్ద ఉన్న వీరాంజనేయస్వామి ఆలయం

పామర్రు: ఈ నెల 22వ తేదీ గురువారం హనుమజ్జయంతిని పురస్కరించుకుని మండలంలోని పలు ఆలయాలు ముస్తాబు చేస్తున్నారు. స్థానిక ఉండ్రపూడి–పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న వీరాంజనేయస్వామి దేవస్థానాన్ని సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దుతున్నారు. జయంతి రోజున తెల్లవారుజామున నాలుగు గంటలకు స్వామికి పంచామృతాభిషేకం, ఉదయం 11 గంటల నుంచి లక్ష తమలపాకులతో అర్చన, అనంతరం అన్న సమారాధన నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పీవీవీ ప్రసాదరావు తెలిపారు. ముఖ్య అతిథులుగా ఎండోమెంట్ అధికారులు పాల్గొని ఆలయంలో పూజలు చేసి అన్న సమారాధన ప్రారంభిస్తారని తెలిపారు. రాత్రి ఏడు గంటలకు శ్రీవీరాంజనేయస్వామి, సువర్చలా దేవిల శాంతి కల్యాణం మహోత్సవం అనంతరం పవళింపు సేవ కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

పామర్రులో..

పామర్రులోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలోని వీరాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి కార్యక్రమం జరుగుతుందని ఆలయ మేనేజర్ జన్ను వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని జమీదగ్గుమిల్లి, రాపర్ల తదితర గ్రామాల్లో హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు సర్వం సిద్ధం చేస్తున్నారు.

ఏపీఈసెట్ 6వ ర్యాంకర్ మహేష్‌కు సత్కారం



ఏపీఈసెట్ 6వ ర్యాంకర్ మహేష్‌ను సత్కరిస్తున్న సర్పంచ్ పూర్ణకుమారి

పమిడిముక్కల: మండలంలోని చోరగుడి గ్రామానికి చెందిన మేకా మహేష్ ఇటీవల విడుదలైన ఏపీఈసెట్ కంప్యూటర్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో 6వ ర్యాంక్ సాధించారు. ఈ సందర్భంగా సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ కందిమళ్ల పూర్ణకుమారి, కార్యదర్శి టీవీ రమణ మహేష్‌ను సత్కరించారు. అదేవిధంగా పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన చోరగుడి హైస్కూల్ విద్యార్థిని మీర్జా జహీరాను, తల్లిదండ్రులను సత్కరించారు.

కిశోర బాలికలకు అవగాహన



కిశోర బాలికలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీఓ విజయా ఫ్లారెన్స్

గుడివాడ టౌన్: ఐసీడీఎస్ ప్రాజెక్ట్ గుడివాడ శాఖ ఆధ్వర్యంలో శనివారం కిశోర బాలికలకు పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం జరిగింది. స్థానిక గుడ్‌మెన్‌పేటలోని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. కౌమారదశ వయస్సులో ఆహారపు అలవాట్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇతర విషయాల్లో వారు మెలగవలసిన తీరును సీడీపీఓ ఎ.విజయా ఫ్లారెన్స్ వివరించారు. కార్యక్రమంలో భాగంగా పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యతను వివరిస్తూ స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



గుడివాడ పోలీస్ స్టేషన్ ఆవరణను శుభ్రం చేస్తున్న ఎస్ఐ చంటిబాబు, సిబ్బంది

గుడివాడరూరల్: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని గుడివాడ తాలూకా ఎస్ఐ ఎస్.చంటిబాబు పేర్కొన్నారు. క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ పరిసరాలను సిబ్బందితో కలసి ఆయనే స్వయంగా శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ప్రశాంత వాతావరణంలో ఉద్యోగాలు చేయడం సులభమవుతుందన్నారు. ప్రతిఒక్కరూ తమ పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకుని వ్యాధుల బారిన పడకుండా ఉండాలని సూచించారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



తోట్లవల్లూరులో కుట్టు శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న వీరంకి గురుమూర్తి, సర్పంచ్ రాధిక

తోట్లవల్లూరు: కుట్టు శిక్షణ ద్వారా మహిళలు ఉపాధి అవకాశాలను మెరుగుపరచుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని గౌడ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ వీరంకి వెంకటగురుమూర్తి పేర్కొన్నారు. స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా తోట్లవల్లూరులో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు శిక్షణానంతరం కుట్టు మిషన్లు అందజేస్తామన్నారు. సర్పంచ్ పెనుమత్స రాధిక, డివిజినల్ డెవలప్‌మెంట్ అధికారి రాజేష్, ఎంపీడీఓ రవికాంత్, ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి రవికుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

రామకోటయ్యకు ఘన నివాళి



రామకోటయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే డీఎన్నార్

ముదినేపల్లి రూరల్: మండలంలోని చిగురుకోటకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధన్ తండ్రి రామకోటయ్య అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) విష్ణువర్ధన్ నివాసానికి చేరుకుని రామకోటయ్య భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎంపీపీ రామిసెట్టి సత్యనారాయణ, పార్టీ నాయకులు దూలం వినయ్‌కుమార్, శ్యాంఫణికుమార్, మోట్రు ఏసుబాబు, శీలం రామకృష్ణ, నాయకులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.